క్లుప్తంగా

అన్నదానం

మేడ్చల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసింది. కేవలం మాలధారణ సమయంలోనే కాకుండా భక్తుల ఆకలి తీర్చేందుకు సంవత్సరం పొడవునా ప్రతీ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు నందారెడ్డి, కృష్ణమూర్తి, రాజేశ్వరగుప్తా, కౌన్సిలర్ నర్సింహా స్వామి యాదవ్, అనిల్‌కుమార్, రవికుమార్, సురేష్ పాల్గొన్నారు.

హక్కులు తెలుసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రమేష్

మేడ్చల్: మహిళలు, ముఖ్యంగా యువతులు తమ హక్కులను తెలుసుకోవాలని మేడ్చల్ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి బి.రమేష్ అన్నారు. పట్టణంలోని గీతాంజలి కళాశాలలో న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, కోశాధికారి సంతోష్, ఎస్‌ఐ మురళీధర్ తదితరులు ఉన్నారు.

కుక్కల బెడద లేకుండా చర్యలు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల బెడద లేకుండా చేసేందుకు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ అన్నారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ పరిధిలో బ్లూక్రాస్ సిబ్బంది ఆధ్వర్యంలో వివిధ కాలనీలో సుమారు 7 వీధి కుక్కలను పట్టుకుని తరలించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు రమేష్‌గౌడ్, మాదిరెడ్డి నర్సింహారెడ్డి, శ్రీహరిగౌడ్, మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన కల్పించాలి

ఘట్‌కేసర్: పట్టణంలోని మినర్వా హైస్కూల్లో శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి హాజరయ్యారు. విద్యార్థులు తాము తయారు చేసిన పరికరాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి వాటి పనితీరును వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్, జంగయ్యయాదవ్, కరస్పాండెంట్లు అనురాధ, రవికుమార్‌గౌడ్, ఉపాధ్యాయులున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరపాలి

- ఈ నెల 12న ఎన్నికల సామగ్రి పంపిణీ
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి,మేడ్చల్ జిల్లా: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ సూచించారు. ఎన్నికల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, డీసీపీ జానకితో కలిసి సెక్టోరియల్ అధికారులు, నోడల్ అధికారులు, ఏసీపీలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల13న జరిగే ఎన్నికలకు జిల్లాలోని 14 పోలింగ్ కేంద్రాలు, పది లోకేషన్లకు సంబంధించి ఒక రోజు ముందే.. అంటే ఈ నెల 12న ఉదయం 8 గంటల నుంచి కలెక్టరేట్ స్ట్రాంగ్ రూమ్ నుంచి ఎన్నికల అధికారులు, సిబ్బందికి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లతో సహా ఎన్నికల సామగ్రిని అందచేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయడం ద్వారా పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు తెలుస్తోందన్నారు. పోలింగ్ కేంద్రా ల్లో ఇప్పటికీ ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే వాటిని పరిష్కరించి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 13న ఎన్నికలు ముగిసిన తర్వాత బ్యాలెట్ బా క్సులను పోలీసు బందోబస్తు నడుమ సరూర్‌నగర్ స్టేడియంకు తరలించి భద్రపరుస్తామన్నారు. సమా వేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, ఆర్డీఓలు రవి, మల్లయ్య, సెక్టోరియల్ అధికారులు, నోడల్ అధికారులు, ఏసీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అమయ్‌కుమార్

ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ ప్రాధాన్యతా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రత్యేక ప్రణాళికతో విజయవంతమయ్యేలా సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ నుంచి రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సీఎస్ శాంతికుమారితో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలు, సూచనలను పాటిస్తూనే.. అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తామన్నారు. కంటి వెలుగు, పట్టణ ప్రాంతాల్లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం, 58, 59, 76 జీఓల మేరకు ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, ఉద్యానవన పంట సాగు వంటి విషయాలను కలెక్టర్ ప్రస్తావించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, అటవీ శాఖ అధికారి జానకీరామ్, వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, రోడ్లు భవనాల శాఖ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసమూర్తి, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహిళల కోసం ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్



సాక్షి,మేడ్చల్ జిల్లా: మహిళల దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో వైద్యాధికారులు మహిళల కోసం తగిన కార్యాచరణ ప్రణాళికతో రూపొందించిన ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తెలిపారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు, గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో ఆయన జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో వైద్యుల పనితీరు మెరుగుపడాల్సిన అవసరం ఉందని శ్రీనివాస్ సూచించారు. డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖాధికారులు నిత్యం రెండు లేదా మూడు పర్యాయాలు కంటివెలుగు శిబిరాలను సందర్శించి సిబ్బంది పని తీరు పరిశీలించాలన్నారు. కంటి వెలుగు క్యాంపు నిర్వహణకు అన్ని విభాగాల సిబ్బంది సాయం తీసుకోవడం ద్వారా ప్రతీ రోజు 120–150 మందికి కంటి పరీక్షలు నిర్వహించాలని ఆయన సూచించారు. పీహెచ్‌సీ సబ్ సెంటర్ల నిర్మాణానికి భూములను గుర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం సబ్ సెంటర్ నిర్వహణకు భవనాలను గుర్తించాలన్నారు. ఔట్ పేషెంట్ల, కాన్పుల సంఖ్య, శాంపిల్ కలెక్షన్, ఎన్‌డీసీ, డయాగ్నోస్టిక్స్ సేవలు, టెలీ కన్సల్టేషన్ సేవలును మెరుగుపర్చాలని డీఎంహెచ్‌ఓ కోరారు. ప్రతి శుక్రవారం ప్రోగ్రాం అధికారులకు, ప్రతి శనివారం వైద్యాధికారులకు 15 రోజులకోసారి కంటివెలుగు వైద్యాధికారులు, సిబ్బంది పని తీరుపై సమీక్ష ఉంటుందని, అందరూ తమ పనితీరుపై నివేదికలతో హాజరు కావాలని తెలిపారు. ప్రజా ఆరోగ్య కార్యక్రమాలపై వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



పట్టణంలోని సెయింట్ జార్జ్‌ఆర్థోడాక్స్ సిరియన్ చర్చ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రేవ్ యార్డును క్రైస్తవ మతపెద్దలతో కలిసి ప్రారంభిస్తున్న పీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి. - మేడ్చల్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగాలను సద్వినియోగం చేసుకోవాలి



ఘట్‌కేసర్: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగాలను ఫార్మసీ రంగంలో సద్వినియోగం చేసుకోవాలని రివైల్ లెఫ్ ఇన్నోవేషన్స్ సీఈఓ కట్నం ప్రకాశ్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఇన్ ఫార్మసూటికల్ రిసెర్చ్ అనే అంశంపై వారం రోజుల నిర్వహించిన శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఫార్మసీ, ఐటీ రంగంలోని ప్రముఖ శాస్త్రవేత్తలు, నిపుణులతో అధ్యాపకులకు శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో ఏపీఐటీ ఉమెన్స్ ఫోరమ్ ఈస్ట్ కోఆర్డినేటర్ కవితరెడ్డి, ఫార్మసీ డీన్ వసుధ భక్షి, డీన్ మనోరంజన్, రవికుమార్, సూర్యకాంతం, రాజశేఖర్‌రెడ్డి, ఆనంద్, స్వప్న, రాజేంద్రకుమార్, శ్వేత పాల్గొన్నారు.

'సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లోపించొద్దు'

ఘట్‌కేసర్: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లోపించొద్దని ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అవుషాపూర్‌లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో భాగంగా అవుషాపూర్‌లో సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డితో కలిసి శనివారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఐలయ్యయాదవ్, వార్డు సభ్యుడు వీరేశం, మశ్చేందర్‌రెడ్డి, సాయిలు, బలరాం, మహేశ్ పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ కావేరి

ఆడపిల్లలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరం



సీఆర్‌పీఎఫ్ కార్యాలయంలో మహిళా దినోత్సవాలు

జవహర్‌నగర్: ఆడపిల్లలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమని అండర్–19 మహిళ క్రికెట్ క్రీడాకారిణి త్రిష అన్నారు. శనివారం సీఆర్‌పీఎఫ్ క్యాంపు కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించాలంటే ఇష్టంగా కష్టపడాలని, యువత చెడు అలవాట్లకు బానిస కాకూడదని సూచించారు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని అండర్–19 క్రికెట్ జట్టులో చోటు సంపాదించానని త్రిష అన్నారు. సీనియర్ భారత క్రికెట్ జట్టులో చోటు సంపాదించడమే లక్ష్యమని ఆమె తెలిపారు. అనంతరం త్రిషను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 99 ఆర్‌ఏఎఫ్ కమాండెంట్ విజయ్‌కుమార్ వర్మ, సెకండ్ ఇన్ కమాండెంట్ రాజేశ్, డిప్యూటీ కమాండెంట్ కామేశ్వర్ సాహూ, ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సోనియావర్మ, ఆర్‌ఏఎఫ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మల్లారెడ్డి యూనివర్సిటీలో వైస్ ఛాన్సలర్ల సదస్సు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మల్లారెడ్డి యూనివర్సిటీలో వైస్ ఛాన్సలర్లకు జేఎన్‌టీయూహెచ్ ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు నిర్వహించే జాతీయ విద్యా విధానం సదస్సును శనివారం మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. విద్యకు సాంకేతికతను జోడించిన కళాశాలల విద్యార్థులకే వంద శాతం ప్లేస్‌మెంట్ లభిస్తున్నాయన్నారు. సదస్సులో సాంకేతిక విద్యా కమిషనర్ నవీన్‌మిట్టల్, జెఎన్‌టీయూ వైస్ ఛాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి, పలు యూనివర్సిటీల వైస్ ఛాన్స్‌లర్లు, మల్లారెడ్డి కళాశాల డైరెక్టర్లు ఉన్నారు.



డబ్బులు దొంగిలించిన వ్యక్తి అరెస్టు




వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

మేడ్చల్: బ్యాంకు నుంచి డ్రా చేసిన డబ్బులు బైక్ నుంచి జారీ పడటంతో వాటిని దొంగతనం చేసిన వ్యక్తిని మేడ్చల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం... మేడ్చల్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో శ్రీనివాస్ అనే వ్యక్తి ఈ నెల 1వ తేదీన రూ.2.90 లక్షలు డ్రా చేసి బైక్‌పై వెళ్తుండగా నగదు ఉన్న బ్యాగ్ ఆయన చూసుకోకుండా కింద పడిపోయింది. ఆయన ఇంటికి వెళ్లాక చూసుకోగా బ్యాగు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బైక్‌పై నుంచి నగదు ఉన్న బ్యాగు కిందపడిపోయిన విషయాన్ని గమనించిన గౌడవెల్లికి చెందిన ఆటో డ్రైవర్ లంబ గోపాల్‌యాదవ్(40) ఆ బ్యాగును దొంగిలించి అక్కడి నుంచి పరారయ్యాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు విచారణలో భాగంగా అక్కడ ఉన్న సీసీ ఫుటేజీ గమనించి దొంగను గుర్తించారు. రెండు రోజుల పాటు దర్యాప్తు చేసి గోపాల్‌యాదవ్‌ను అరెస్ట్ చేసి రూ.2.90లక్షల నగదును రికవరీ చేశారు. సమావేశంలో డీఐ కృష్ణప్రసాద్, ఎస్‌ఐ నర్సింహాగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

వీడిన కౌకూర్ మర్డర్ మిస్టరీ

- స్నేహితులే కొట్టి.. కాళ్లపై పెట్రోల్ పోసి నిప్పంటించిన వైనం



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ జానకీ


జవహర్‌నగర్: కౌకూర్‌కు చెందిన యువకుడు సైఫ్ అలీఖాన్ మర్డర్ మిస్టరీని జవహర్‌నగర్ పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. స్నేహితులే విచక్షణా రహితంగా దాడి చేయడంతో పాటు కాళ్లపై పెట్రోల్ పోసి తగలబెట్టారు. ఈ ఘటనపై శనివారం మల్కాజ్‌గిరి డీసీపీ జానకీ మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మృతుడు సైఫ్ అలీఖాన్(25)తో పాటు నిందితులు వాలి శ్రవన్‌కుమార్, దొబ్బల విక్రమ్ అలియాస్ గడ్డు వీరంతా రాజీవ్ గృహకల్ప భరత్‌నగర్‌లో నివాసం ఉంటారు. అదేవిధంగా అల్వాల్‌కు చెందిన బూరుగుపల్లి విగ్నేష్, సృజన్‌లు వీరంతా స్నేహితులు. కాగా ఈ నెల 2న రాత్రి 10:30 సమయంలో వాలి శ్రవణ్‌కుమార్, విగ్నేశ్‌లు అదే కాలనీలోని కిరాణ దుకాణం వద్ద ధూమపానం చేస్తున్నారు. అదే సమయంలో మృతుడు సైఫ్ కొందరితో గొడవ పడుతుండటంతో శ్రవణ్ అక్కడికి చేరుకుని సైఫ్ అలీఖాన్‌ను కొట్టి గొడవను సర్దుమనిగించారు. అక్కడి నుంచి స్నేహితుడు విక్రమ్ ఇంటికి వచ్చారు. తనను అందరి ముందు కొట్టి అవమానించారని మృతుడు సైఫ్ అలీఖాన్ స్నేహితులతో గొడవ పడ్డాడు. దీంతో ముగ్గురు స్నేహితులు మృతుడు సైఫ్ అలీఖాన్‌ను కర్రలతో విచక్షణా రహితంగా కొట్టి, విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న బహిరంగ ప్రదేశానికి తీసుకువెళ్లారు. అనంతరం కాళ్లపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. మృతి చెందాడని నిర్ధారించుకుని అక్కడి నుంచి పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి నిందితులను అదులోకి తీసుకోగా మరో నిందితుడు సృజన్ పరారీలో ఉన్నట్లు ఆమె తెలిపారు. సమావేశంలో ఎస్‌ఓటీ డీసీపీ గిరిధర్ ఐపీఎస్, కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి, జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ సీతారాం, సిబ్బంది పాల్గొన్నారు.

దౌర్జన్యానికి పాల్పడ్డ వ్యక్తిపై ఫిర్యాదు

ఘట్‌కేసర్: పార్కు స్థలంలో ఇంటి నిర్మాణానికి అనుమతి నిరాకరించినందుకు దౌర్జన్యం చేసిన శంకర్‌నాయక్ అనే వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కొర్రెముల్ సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, కార్యదర్శి కవిత పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. కొర్రెముల్‌లోని 747, 750 సర్వే నంబర్లలో చేసిన జమాలుద్దీన్ వెంచర్‌లో పార్కు కోసం 1000 గజాల స్థలాన్ని గతంలో కేటాయించారన్నారు. శంకర్‌నాయక్ అనే వ్యక్తి 2002లో పార్కు స్థలంలో 438 గజాలు ప్లైనంబర్ 5/ఏతో కొనుగోలు చేసి ఇంటి నిర్మాణానికి పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారన్నారు. పార్కు స్థలంలో ఇంటికి అనుమతి నిరాకరించినందుకు గతంలో అనుమతి కోసం అందజేసి దరఖాస్తును చింపివేయడానికి దౌర్జన్యంగా లాక్కున్నాడని సర్పంచ్, కార్యదర్శి ఫిర్యాదులో పేర్కొన్నారు. దౌర్జన్యం చేసిన అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కౌన్సిలర్ ఆఫీస్‌ను ధ్వంసం చేసిన వారిపై కేసు

ఘట్‌కేసర్: కౌన్సిలర్ కార్యాలయం ధ్వంసం చేసిన వారిపై ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. సీఐ అశోక్‌రెడ్డి వివరాల ప్రకారం... మున్సిపల్ మూడో వార్డు కౌన్సిలర్ బొక్క సంగీతకు బొక్కొనిగూడ చౌరస్తాలో కార్యాలయం ఉంది. శనివారం కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి కౌన్సిలర్ కార్యలయంలోకి అక్రమంగా ప్రవేశించి రాళ్లతో ఫర్నీచర్ ధ్వంసం చేశారు. ఎందుకని ప్రశ్నించిన కౌన్సిలర్‌ను మహిళ అని చూడకుండా వ్యక్తిగతంగా దూషిస్తూ చేయి చేసుకున్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో మాతో పోటీ పడి ఓడిన విషయం దృష్టిలో పెట్టుకుని దాడి వారు చేశారని, నాకు, నా భర్త ప్రభాకర్‌రెడ్డికి వారి నుంచి ప్రాణభయం ఉందని కౌన్సిలర్ సంగీత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. కాగా దాడికి నిరసనగా మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, పలువురు కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.



ధ్వంసమైన కౌన్సిలర్ కార్యాలయం

విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతులు, చెట్ల నరికివేత కారణంగా ఆదివారం కిష్టాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో అన్ని ఇండస్ట్రీయల్ సర్వీసులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

టాలెంట్ టెస్ట్

మేడ్చల్: పట్టణంలోని స్ఫూర్తి కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన 800 మంది పరీక్షకు హాజరయ్యారు. విద్యార్థులకు పరీక్షలపై ఉండే భయం తొలగించి వారి నైపుణ్యతను సాన బెట్టేందుకు ఈ టెస్ట్ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మంజుల ప్రకాష్, కమలాకర్‌రెడ్డి, గణేష్, దేవరాజ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరుపై సభ్యులు అసహనం



మేడ్చల్: మండలంలోని వివిధ శాఖల అధికారుల పనితీరుపై మండల పరిషత్ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించ గా సభ్యులు పాల్గొని అధికారుల తీరుపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సమావేశాలకు మండల ఉన్నతాధికారులు రాకుండా ద్వితీయ శ్రేణి అధికారులు హాజరై సభ్యులు లేవనెత్తిన సమస్యలను నోట్ చేసుకుని వెళ్లిపోతున్నారే గానీ.. వాటిని పరిష్కరించడం లేదని ఆవేదన వ్య క్తం చేశారు. మండల కేంద్రం, గ్రామాల్లో నిర్వహించే సమావేశాలకు అధికారులు అసలే హాజరుకావడం లేదన్నారు.

సభ్యులు ప్రస్తావించిన సమస్యలు..

ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ల, ఆయాల పోస్టుల ను భర్తీ చేయాలని సర్పంచ్ సురేందర్ డిమాండ్ చేయగా.. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన ఆహా రం అందించడం లేదని మరో సభ్యురాలు హేమలత అన్నారు. గౌడవెల్లి గ్రామంలో పల్లె ప్రగతిలో 70 స్తంభాలు మార్చాలని అధికారులు గుర్తించినా డబ్బులు గ్రామ పంచాయతీ భరిస్తోందని చెప్పినా ఇంత వర కు వేయడం లేదని సర్పంచ్ సురేందర్ ప్రశ్నించారు. విద్యుత్ శాఖాధికారులు సమస్యలను పట్టించుకోవడం లేదని సర్పంచ్‌లు మాంగ్యానాయక్, గణేష్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం చేసే గదిని కూల్చేసి పోస్టుమార్టంలను మేడ్చల్‌లో చేయడం లేదని మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్ ప్రశ్నించారు. భవనంను తాత్కాలికంగా ఏర్పాటు చేస్తామని మేడ్చల్‌లోనే పోస్టుమార్టం చేయాలని ఎంపీపీ అన్నారు. సీహెచ్‌ఎన్‌సీలో డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదన్నారు. గౌడవెల్లిలో చెరువు శిఖం భూములు కబ్జా చేస్తున్నా పట్టించుకోవడం లేదని, ధరణి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏనాడు సమావేశానికి ఆర్టీసీ డీఎం రావడం లేదని ఆగ్రహించిన జెడ్పీటీసీ ఆయనను సమావేశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వెంకటేశం, జెడ్పీటీసీ శైలజవిజయానందరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు సుధాకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, ఎంపీడీఓ పద్మావతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు. కాగా సమావేశానికి చాలా మంది సభ్యులు, అధికారులు రాకపోవడంతో సమావేశంలోని కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.